## రైతు సమస్యలు పరిష్కరిస్తా



కడా ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 20 : మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి ప్రజా సంఘాలు, రైతులకు హామీ ఇచ్చారు. షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని, రుణమాఫీ అయిన రైతు లకు కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని, ఎస్‌బీఐలో సిబ్బంది సంఖ్యను పెంచాలనే ప్రధాన డిమాండ్లతో ఈ నెల 17 నుంచి 19 వరకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేసిన రైతులు శుక్రవారం తమ సమస్యను కడా ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అంద జేశారు. బొంరాస్‌పేట మండలంలో కొత్తగా మరొక బ్యాంకును ఏర్పాటు చేయాలని కోరారు. రుణమాఫీ కాని రైతుల వివరాలను అందజేశారు. వీటిని పరిశీలించిన వెంకట్‌రెడ్డి అర్హులందరికీ రుణమాఫీ అయ్యేలా చూస్తానని చెప్పారు.

కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యా నాయక్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుభాష్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు తాలూకా అధ్యక్షుడు రమేశ్, కేఎన్‌పీఎస్ నాయకులు లక్ష్మయ్య, వెంకటయ్య, నర్సింహులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి



స్టాల్‌ను సందర్శించి పరిశీలిస్తున్న డీడబ్ల్యూవో కృష్ణవేణి

పరిగి, సెప్టెంబర్ 20 : ప్రతిఒక్కరూ చక్కటి పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని డీడబ్ల్యూవో కృష్ణవేణి, పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావు సూచించారు. శుక్రవారం పరిగిలో పోషణ్ మాసం సందర్భంగా పోషణ్‌మహ ప్రోగ్రాం, సీమంతాలు, అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలతో స్టాల్ ఏర్పాటు చేశారు. సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పోషకాల లోపాలతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో మెహర్ ఉన్నిస్సా, సూపర్ వైజర్లు యాదమ్మ, నిర్మల, ఇందిర, ఉజ్వల, రాణి, అంజమ్మ, మహిళా సాధికారత బృందం వరలక్ష్మి, బాబు, చిట్యాల్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రాఘువేందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతాహీ సేవాపై విద్యార్థులకు అవగాహన




ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, విద్యార్థినులు

పరిగి, సెప్టెంబర్ 20 : తడి, పొడిచెత్తలను వేరుచేసి చెత్త సేకరణ వాహనాలలో వేయాలని పరిగి మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య సూచించారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగం గా శుక్రవారం పరిగిలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఇంటింటి నుంచి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను బయట పారవేయవద్దని, డ్రైనేజీలో ప్లాస్టిక్ కవర్లు వేయరాదన్నారు. చెత్త సేకరణ వాహనాల్లోనే చెత్త వేయాల్సిందిగా సూచించారు. పరిశుభ్రత వల్ల అనేక వ్యాధులు రావని, దోమల నివారణకు అందరు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, మున్సిపల్ మేనేజర్ నరేశ్, మెప్మా టీఎంసీ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


## దోమల నివారణతో వ్యాధులు దూరం



దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో కరీం

పరిగి, సెప్టెంబర్ 20 :దోమలను పూర్తిస్థాయిలో నివారిస్తే సీజనల్ వ్యాధులు రావని పరిగి ఎంపీడీవో ఎం.ఎ.కరీం సూచించారు. శుక్రవారం డ్రై డే – ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని షోండేపూర్, రూప్‌ఖాన్‌పేట్, చిగురాల్‌పల్లి గ్రామాలను సందర్శించిన ఎంపీడీవో దోమల నివారణపై ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. పాత సామగ్రిలో వర్షం నీరు నిల్వ, ఇంటి పరిసరాలలో నిలువ నీటి గుంటలు ఉండకుండా చూడాలన్నారు. నిలిచే నీటిలోనే దోమలు గుడ్లు పెడతాయని చెప్పారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాల్సిందిగా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. నిత్యం పారిశుధ్య పనులు చేయించాలని అన్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, ప్రకృతి వనాలలో పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజేశ్ రాథోడ్, పంచాయతీ కార్యదర్శులు వెంకటగిరి, మొగులయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ ఎల్లప్ప, జంగయ్య, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా మహిపాల్‌రెడ్డి



పరిగి, సెప్టెంబర్ 20: పరిగి మండల ప్రభుత్వ చౌకధరల దుకాణాల డీలర్ల సంఘం అధ్యక్షుడిగా కె.మహిపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం పరిగిలో జరిగిన సమావేశంలో రేషన్ డీలర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కె.మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బి.నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా ఎం.డి.ఫసీయోద్దీన్, కోశాధికారిగా తులసీరాం, కార్యవర్గ సభ్యులుగా ఎ.లక్ష్మి, ఎస్.నిర్మల ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను రేషన్ డీలర్లు సన్మానించారు. అనంతరం తహసీల్దార్ ఆనంద్‌రావును కలిసి నూతన కార్యవర్గం వివరాలు అందజేశారు.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కులకచర్ల పెద్ద గేటు చౌరస్తాలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కులకచర్ల, సెప్టెంబర్ 20 : కులకచర్ల మండల కేంద్రంలో రెండు సంవత్సరాలుగా నిలిచిన సీసీ రోడ్డు పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గతంలో ఒక పక్కమాత్రమే రోడ్డు పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ రోడ్డుకు కావల్సిన నిధులు సరిపోవడం లేదని పనులు నిలుపుదల చేశారు. దీంతో రెండు సంవత్సరాలుగా రోడ్డు బాగా లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బుధవారం కులకచర్లలో నిర్వహించిన రైతు వేదికలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పనులు ప్రారంభించాలని సంబంధిత కాంట్రాక్టర్ సూచించారు. దీంతో శుక్రవారం మండల నాయకుల ఆధ్వర్యంలో రోడ్డు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్2 అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ ఆనందం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, పార్టీ నాయకులు మహిపాల్‌రెడ్డి, పీరంపల్లి రమేశ్, నర్సింలు, సోషల్‌మీడియా కన్వీనర్ వెంకటేశ్, కృష్ణయ్య, భాను, మోర వెంకటేశ్, అమృతయ్య, రాము, మొగులయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

కులకచర్ల, సెప్టెంబర్ 20 : ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. శుక్రవారం కులకచర్ల మండల కేంద్రంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సక్రమంగా ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు. ముఖ్యంగా మిషన్ భగీరథ ద్వారా అందిస్తున్న నీటి సదుపాయం అన్ని గ్రామాలకు అందే విధంగా చూడాలన్నారు. ప్రజా పాలనలో భాగంగా విద్యుత్, ఎల్పీజీ గ్యాస్‌లు ప్రజలకు సక్రమంగా అందిస్తున్నారా అని అధికారులను ప్రశ్నించారు. అన్ని విధాలుగా ప్రజలు లబ్ధిపొందేందుకు సహకరించాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో పరిసరాల పరిశుభ్రత సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండే విధంగా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ప్రజల సమ స్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు గ్రామాల్లో పంచా యతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలని సూచించారు. నిర్ల క్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, కులకచర్ల తహ సీల్దార్ మురళీధర్, చౌడాపూర్ తహసీల్దార్ ప్రభులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పట్టపగలు చైన్ స్నాచింగ్

### మహిళ మెడనుంచి పుస్తెలతాడు చోరీ

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 20 : మండలంలోని నాందార్‌పూర్‌లో శుక్రవారం పట్టపగలు చైన్ స్నాచింగ్ జరిగింది. గ్రామానికి చెందిన చిట్లపల్లి లక్ష్మమ్మ శుక్రవారం మధ్యాహ్నం తమ దుకాణం నుంచి ఇంటికి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుంది. ఇంతలో బైకుపై ఇద్దరు యువకులు వచ్చి లక్ష్మమ్మ మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కెళ్ళిపోయారు. అడ్డుకోబోయిన స్థానికులకు కత్తులు చూపి బెదిరించి తుంకిమెట్లవైపు పరారయ్యారు. తుంకిమెట్లలో కొంతమందికి సమాచారం అందించి అప్రమత్తం చేయగా స్థానిక యువకులు దొంగలను పట్టుకోవడానికి ప్రయత్నించారు. గమనించిన దొంగలు మళ్లీ వెనక్కి తిరిగి నాందార్‌పూర్ మీదుగా బాపల్లితండా వైపు వెళ్లిపోయారు. బాపల్లి తండాలో కూడా యువకులు దొంగలను పట్టుకోవడానికి ప్రయత్నించగా కత్తిని చూపి బెదిరించి కోస్గి వైపు వెళ్లిపోయారు. నెంబరు లేని పల్సర్ బైకుపై యువకులు వచ్చినట్లు ఆయా గ్రామాల యువకులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, బొంరాస్‌పేట ఎస్సై అబ్దుల్ రవూఫ్ నాందార్‌పూర్‌కు వెళ్లి మహిళను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాపల్లితండాలో ఉన్న సీసీ కెమెరా పుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు.

## అభివృద్ధే లక్ష్యం : ఎంపీ కొండా



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, సెప్టెంబర్ 20 : చేవెళ్ల పార్లమెంట్ పరిధిని అభివృద్ధి చేయాలన్నదే తన కల అని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీజేపీ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్ నేషన్– వన్ ఎలక్షన్ అంటే కాంగ్రెస్ నేత రాహుల్‌కు భయమెందుకన్నారు. వికారాబాద్‌లో ఎన్‌సీసీ కార్యాలయం, నాగారంలో టెలీకమ్యూనికేషన్ టవర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఏకలవ్య ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల తెస్తామన్నారు. తన నిధులతో సీసీ రోడ్లు, గ్రామ సడక్ యోజన ద్వారా ప్రతి పల్లెకూ రోడ్లు వేస్తామని వివరించారు. ఎంఎంటీఎస్ రైళ్లను మొదటగా శంకర్ పల్లి వరకు తెచ్చేలా కృషి చేస్తానని, ఆ తర్వాత వికారాబాద్‌కు వస్తుందని చెప్పారు. వికారాబాద్ చుట్టూ రైల్వే ట్రాక్స్ ఉన్నాయని దాని వల్ల ఇబ్బందులు పడటం జరుగుతుందని గ్రహించి గంగారాం, రామయ్యగూడ రైల్వే బ్రిడ్జి ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్య క్షుడు సాయిచరణ్ రెడ్డి , నాయకులు వడ్ల నందు, కేపీ రాజు, శివరాజ్, రాజశేఖర్ ఉన్నారు.

**ధారూరు:** మండల పరిధిలో కేరెళ్లి గ్రామంలో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పెద్ద ఎత్తున సభ్యత్వం చేసి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి, నాయకులు వడ్ల నందు, పాండు గౌడ్, రమేశ్ తదితరులు ఉన్నారు

## గురువుకు, విద్యార్థికి సన్మానం..



విద్యార్థి చిత్రీకరించిన చిత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు.

కొడంగల్, సెప్టెంబర్ 20: మండలంలోని హస్నాబాద్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకునే సమయంలో నవీన్ అనే విద్యార్థి డ్రాయింగ్ టీచర్ వెంకట్రావు ద్వారా చిత్రాలను గీయడంలో ప్రతిభను కనబరిచాడు. కాగా ప్రస్తుతం కొడంగల్ ప్రభుత్వ కళాశాలలో ఆ విద్యార్థి ఇంటర్ విద్యను అభ్యసిస్తూ.. సుభాష్ చంద్రబోస్, సర్వేపల్లిరాధాకృష్ణన్, భగత్‌సింగ్ వంటి చిత్రాలను అద్భుతంగా చిత్రీకరించి అందరి మన్ననలను అందుకొంటున్నాడు. ఇందుకు గాను శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రాయింగ్ టీచర్ వెంకట్రావు, విద్యార్థి నవీన్‌ను అధ్యాపకులు ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాంరెడ్డితో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి ఉపాధ్యాయులు ఆనంద్‌రావు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నిందితులపై చర్యలు తీసుకోవాలి

వికారాబాద్, సెప్టెంబర్ 20 : దళిత యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు బాధితులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాలాల మండలం ఎన్కెపల్లి గ్రామానికి చెందిన నట్టల మనోహర్‌ను కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడ్డ నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. కారు డ్రైవింగ్ పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న మనోహర్‌ను కొందరు వ్యక్తులు తాండూరు పట్టణంలోని సింధూ జూనియర్ కాలేజీ సమీపంలో కారులో కిడ్నాప్ చేసి కట్టెలతో, రాడ్లతో దాడి చేశారన్నారు. బాధితుడి తల్లి రత్నమ్మ ఫిర్యాదు మేరకు తాండూరు 1 టౌన్ పోలీసులు హత్యాయత్నం కింద కేసులు నమోదు చేశారని తెలిపారు. బాధితులకు రక్షణ కల్పించి నష్టపరిహారం చెల్లించి, పునరావాసం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్పన, డీబీఎఫ్ యువ నేతలు నవీన్, కాశయ్య పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి రూ. లక్ష చెక్కు అందజేత

పరిగి, సెప్టెంబర్ 20 : ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన పరిగి మండలం కాళ్లాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.వెంకటయ్య కుటుంబసభ్యులకు పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర శాఖ తరపున లక్ష రూపాయల చెక్కును సంఘం జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ పరిగి మండల అధ్యక్షుడు బుగ్గయ్య, గౌరవాధ్యక్షుడు ఉస్మాన్‌అలీ, ప్రధాన కార్యదర్శి రాకేశ్, నాయకులు రామాంజనేయులు, నరసింహులు, వెంకటయ్య, శ్రీశైలం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## వైద్యం అందక బర్రె మృతి..



వికారాబాద్, సెప్టెంబర్ 20 : పశువైద్యాధికారి నిర్లక్ష్యంతో బర్రె మృతి చెం దిం దని బాధిత రైతు రవి ఆగ్రహం వ్యక్తం చేశా డు. వికారాబాద్ పట్టణం ఆలంపల్లికి చెం దిన రవి తన బర్రె అనారోగ్యంగా ఉం డడంతో చికిత్స నిమిత్తం శుక్రవారం ఉద యం పది గంటలకు వికారాబాద్ పశువైద్యశాలకు తీసుకొచ్చాడు. కాగా అక్కడ విధు లు నిర్వర్తించే వైద్యుడు రాకపోయే సరికి అతడికి ఫోన్ చేయగా.. తాను మో మిన్‌పేటలో జరిగే స్పీకర్ మీటింగ్‌కు హాజరైనట్లు ..ఇప్పుడు అక్కడికి రాలేనని సమాధానమిచ్చారు. కాగా సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆ బర్రె మృతి చెం దడంతో ఆగ్రహానికి గురైన రవి... దానిని పశువైద్యాధికారి కార్యాలయం ఎదుటే ఉంచి బైఠాయించాడు.

## పౌష్టికాహారంపై జాగ్రత్తలు తీసుకోవాలి



విద్యార్థులకు అవగాహణ కల్పిస్తున్న సీడీపీవో ప్రవీణ

మర్పల్లి, సెప్టెంబర్ 20: విద్యార్థులు పౌష్టికాహారంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీడీపీవో ప్రవీణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థినులకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలు పౌష్టికాహారంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రిజ్వానా, హెల్త్ సూపర్వైజర్, అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు..

## జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

కొడంగల్, సెప్టెంబర్ 20: మాదిగల మేలుకొలుపు యాత్ర శుక్రవారం కొడంగల్ పట్టణానికి చేరుకున్న సందర్భంగా అంబేద్కర్ కూడలిలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా. పిడమర్తి రవి మాట్లాడతూ సీఎం రేవంత్‌రెడ్డి చొరవతోనే ఎస్సీ వర్గీకరణపై కమిటీ ఏర్పాటయిందని ఈ కమిటీ మాదిగలకు న్యాయం చేసే విధంగా సీఎం దిశానిర్దేశం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీల వర్గీకరణ జిల్లాల వారీగా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి పది జిల్లాల్లో మాదిగల జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో కొడంగల్ నియోజకవర్గ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రమేశ్‌బాబు, వికారాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రమేశ్‌బాబు, కె. శ్రీను, పి. శ్రీను, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డా.వీరేందర్, ఎంహెచ్‌సీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్, బీఎస్ఫ్ రాష్ట్ర కన్వీనర్ సురేశ్, నరేవరకొండ నరేష్, మొగిలిగిద్ద ప్రసాద్, జేఏసీ ఓయూ అధ్యక్షుడు గణేశ్, కళాకారులు పిడమర్తి రాంబాబు, వజీత్, గణేశ్, సాయిలు, చిన్నయ్య, కనకప్ప, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంగ్లిష్‌పై పట్టు సాధించడమే లక్ష్యం




శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో చంద్రప్ప

బంట్వారం (కోట్‌పల్లి), సెప్టెంబర్ 20 : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆంగ్లంపై మంచి పట్టు సాధించాలని ఎంఈవో చంద్రప్ప అన్నారు. శుక్రవారం కోట్‌పల్లి మండల వనరుల కేంద్రంలో 65 మంది ఉపాధ్యాయులకు ఇంగ్లిష్ ఎన్‌రీచ్‌మెంట్ రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్లం పై మంచి పట్టు సాధించి భయం, నమోషీ లేకుండా అనర్గళంగా మాట్లాడలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ప్రతి విద్యార్థి చిన్న, చిన్న పదాలు, వాక్యాలను ఉచ్చరించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని చూచించారు. కార్యక్రమంలో ఎంఎన్‌వో అరుణ్‌కుమార్, రిసోర్స్ పర్సన్ జయశ్రీ, నరేశ్, అఖిలా, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ టీ పౌడర్, గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

కులకచర్ల, సెప్టెంబర్ 20 : ఉమ్మడి జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు చౌడాపూర్ మం డల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో దాడులు నిర్వహించారు. అల్లం వెల్లుల్లి, కల్తీ టీ పౌడర్, నిషేధిత గుట్కాను పట్టుకుని కులకచర్ల పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు చౌడాపూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాల దుకా ణాల్లో తనిఖీలు నిర్వహించారని 20కిలో కల్తీ టీపౌడర్, 1500గుట్కా ప్యాకెట్లు, కొంత మొత్తంలో అల్లం వెల్లుల్లి పేస్టును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

IN THE COURT OF JUNIOR CIVIL JUDGE TANDUR AT TANDUR, VIKARABAD DIST.
O.S. 85 of 2010
Between:
Pandu Naik ...Plaintiff
And
Badya Naik and Other ...Defendants
To
**Smt. Rukka Bai**
W/o. Chandar Chawan
Age: 42 Years, Occ: Agricultur
R/o. Vadicharla Village, Bombraspet Mandal, Viakarabad Dist.
Whereas The plaintiff, has instituted a suit against you for perpetual Injunction. You are hereby summoned to appear in this Court in person on 27-09-2024 to answer the claim; and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of your defence. Take notice that in default of your appearance on the day before mentioned, the suit will be heard and determined in your absence.
//By the order of Court//
Sd/- B. Bhavanappa, Advocate
#2-2-226/2A, Shanthi Nagar
Tandur-501141. Ph:9441428369

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
KIDNY STONES
★ మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్ లేని హోమియో పరిష్కారం, 47 సం|| అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones, Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580.
NT-332617
WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331771-AII
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962